క్లుప్తంగా

పరీక్ష ప్యాడ్లు, పెన్నుల వితరణ

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామస్తుడు షరీఫ్ వారి తండ్రి షేక్‌బాలీ జ్ఞాపకార్థం గురువారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు వితరణగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వరలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెబ్బేరు రూరల్: మున్సిపాలిటీ కేంద్రంలో లబ్ధిదారులకు గురువారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలానికి చెందిన దుర్గమ్మకు రూ.60వేలు, చాకలి సూరయ్యకు రూ.9 వేల విలువ గల చెక్కులను కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

నేడు సీపీఎం జిల్లా స్థాయి సమావేశం

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని దాచలక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సీపీఎం జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ అఖిలభారత మహాసభల రాజకీయ ముసాయిదా తీర్మానం, రాజకీయ సమీక్షా నివేదిక వివరిస్తారన్నారు. రాబోయే కాలంలో పార్టీ చేపట్టే పోరాటాల రూపకల్పనపై చర్చ ఉంటుందని తెలిపారు. జిల్లాలోని పార్టీ శాఖ కార్యదర్శులు, జిల్లా, మండల కమిటీ సభ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పాన్‌గల్: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో పౌష్టికాహారం, శుభ్రతపై మహిళా సంఘాల సభ్యులు, వీఓఏలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు సీహెచ్‌ఓ రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌష్టికాహారంతో పాటు ఆకుకూరలు, పండ్లు తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని, దీంతో పాటు మహిళల్లో వచ్చే ఆరోగ్య మార్పులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. సమావేశంలో ఎంఎల్‌హెచ్‌పీలు శశాంక్, మైథిలి, సూపర్‌వైజర్ శాంతమ్మ, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఎర్రవల్లి: గుట్టు చప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై గురువారం ఇటిక్యాల పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొగాకు కంపెనీ వద్ద ప్రియాంక రెస్టారెంట్ సమీపంలో పేకాట నిర్వహిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేశామన్నారు.

రహదారులపైనే సంతలు



అమరచింతలో ప్రధాన రహదారిపై కొనసాగుతున్న సంత



సంతలో చిక్కుకున్న స్కూల్ బస్సు

- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- పూర్తి కాని సమీకృత మార్కెట్ నిర్మాణం

అమరచింత: పట్టణంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా వారాంతపు సంతలు కొనసాగుతుండడంతో వాహనదారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ కేంద్రాల్లో సమీకృత మార్కెట్లను నిర్మించి కూరగాయలు, పూలు, పండ్ల వ్యాపారులతో పాటు చికెన్, మటన్, చేపల విక్రయాలను సైతం వాటిలోనే నిర్వహించాలనే లక్ష్యంతో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. కానీ చేసిన నిర్మాణ పనులకు అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో సదరు కాంట్రాక్టర్లు నిర్మాణ పనులను నిలిపివేయడంతో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు మరుగునపడ్డాయి. దీంతో పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత మున్సిపాలిటీల్లో వారాంతపు సంతల నిర్వహణతో పాటు నిత్యం కూరగాయల విక్రయాలు ప్రధాన రహదారులకు ఇరువైపులా కొనసాగుతున్నాయి. దీంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అరికట్టే ప్రయత్నాలను అధికారులు చెపట్టలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారాంతపు సంతల నిర్వహణతో పాటు నిత్యం కూరగాయలు, పండ్ల విక్రయాలను ప్రత్యేక స్థలంలో కొనసాగించాలని వినియోగదారులు కోరుతున్నారు. మార్కెట్‌లో విక్రయాలకు వస్తున్న చిరు వ్యాపారులతో మున్సిపాలిటీ అధికారులు తైబజార్ రూపంలో పన్నులు వసూలు చేస్తున్నా.. వ్యాపారులకు మాత్రం సౌకర్యాలను కల్పించలేకపోతున్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేష్

అమరచింత: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో నేరాలు అదుపు చేసేందుకు అవకాశం ఉంటుందని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఎస్‌ఐ సురేష్ కోరారు. మండలంలోని కిష్టంపల్లిలో గురువారం సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. గ్రామాలు, పట్టణాల్లో తరచూ చోరీలు, అసాంఘిక కార్యక్రమాలు, ప్రమాదాలు, దాడులు పెరుగుతున్నాయని వీటిని అదుపు చేయడంతో పాటు నిందితులను వేగంగా పట్టుకునేందుకు సీసీ కెమెరాలు తోడ్పడతాయన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేసుకుని గ్రామంలో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుందన్నారు.

632 మందికి మధుమేహ పరీక్షలు



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలు మండలంలో కొనసాగుతున్నట్లు పీహెచ్‌పీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలో కొనసాగుతున్న షుగర్ పరీక్షలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 ఏళ్లు దాటినవారందరూ షుగర్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధి నిర్ధారణ అయితు ఆహారపు అలవాట్లను మార్చుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో 632 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం పీహెచ్‌సీలో నెలవారి సమావేశం నిర్వహించి జాతీయ ప్రోగ్రాం, వ్యాధి నిరోధక టీకాల అంశాలపై చర్చించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

చంద్రశేఖర్ ఆజాద్ పోరాటాలు మరువలేనివి



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, నాయకులు

వనపర్తి టౌన్: భారత స్వాతంత్ర పోరాట యోధుల్లో ఒకరైన చంద్రశేఖర్ ఆజాద్ పోరాటాలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, గంధం నాగరాజు, వెంకటస్వామి, శ్రీనివాసులు, రఘునాథరెడ్డి, రాములు, సతీష్, రమేష్‌చారి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరం విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ సాయిశ్రీ తెలిపారు. ఈ క్యాంపులో మొత్తం 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులు అందించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 28 మందిని కంటి ఆపరేషన్ కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. కంటి పరీక్షల కోసం వచ్చిన వారికి ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, సింగల్‌విండో వైస్‌చైర్మన్ క్యామ రాజు భోజన వసతి కల్పించగా.. గ్రామానికి చెందిన దీర్ఘాయువు కంటి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కల్యాణ మండపాన్ని ఉచితంగా ఏర్పాటు చేసినట్లు వైద్యులు పేర్కొన్నారు.

క్షయపై అవగాహన కలిగి ఉండాలి



టీబీ నిర్ధారణ శిబిరాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

వీపనగండ్ల: మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం 210 మందికి క్షయ పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. ప్రత్యేక వైద్య బృందంచే కల్వరాలలో 108 మందికి పరీక్షలు నిర్వహించగా.. ఒకరిని టీబీ ఉన్నట్లు గుర్తించామని, పుల్గర్‌చర్ల గ్రామంలో 92 మందిని పరీక్షించగా ముగ్గురికి టీబీ పాజిటివ్‌గా తేలిందని ఆయన చెప్పారు. టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం వల్ల రోగులను ప్రాణపాయ స్థితి నుంచి కాపాడవచ్చన్నారు. శుక్రవారం వీపనగండ్ల, తూంకుంట గ్రామాల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని ఇరు గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ శ్వేత, కరుణశ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్ కేశవులు, హెల్త్ అసిస్టెంట్లు రాములు, జహంగీర్, టీబీ ప్రోగ్రాం సిబ్బంది ప్రవీణ్, రత్నం, ధర్మ, గోవింద్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

వనపర్తి విద్యావిభాగం: ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి.రజిని అన్నారు. గురువారం వనపర్తిలోని బాలుర మహాత్మా జ్యోతిబాపూలే వెల్ఫేర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వి.రజిని మాట్లాడుతూ.. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఆర్జించాలనే అత్యాశను సైబర్ నేరగాళ్లు లాభాలుగా మార్చుకుంటున్నారని, అత్యాశకు వెళ్లి అపరిచిత వెబ్‌సైట్‌లో లాగిన్ అయి బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులను పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాల్యవివాహాల చట్టం, పోక్సో యాక్ట్, మోటార్ వాహనాల చట్టం, బాల కార్మికుల చట్టం గురించి వివరించారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. పరీక్షల సమయం కావడంతో ప్రతి ఒక్క విద్యార్థి కూడా క్రమశిక్షణతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్తరయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేఘ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు



పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు రెండో రోజు గురువారం కొనసాగాయి. పోటీల్లో వివిధ గ్రామాల నుంచి 32 టీంలు తలపడుతున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

మామిడి రైతులకు ప్రయోజనం

వీపనగండ్ల: మామిడి కాయలలో నాణ్యత ప్రమాణాలను రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ ద్వారా అందిస్తున్న కవర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యానవన శాఖ అధికారి కృష్ణ, క్లస్టర్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ రవికుమార్ తెలిపారు. మామిడి క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగాంలో భాగంగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడి కాయలకు అమర్చే కవర్లను 50 శాతం సబ్సిడీతో అందిస్తుందన్నారు. ఒక కవర్‌కు రూ.1.12పైసలు చెల్లించి రైతులకు అవసరాన్ని బట్టి కవర్లు తెప్పించుకోవచ్చన్నారు.

పరమేశ్వరస్వామి చెరువులో పడవ షికారు



బోట్లకు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని పరమేశ్వరస్వామి చెరువులో శుక్రవారం నుంచి పడవ ప్రయాణం ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాలతో టూరిజం శాఖ ఆధ్వర్యంలో రెండు బోట్లను గురువారం రాత్రి ఆత్మకూర్‌కు తెప్పించారు. ఈమేరకు ఆలయ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు టూరిజం శాఖ అధికారులకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు పరిసరాలను పరిశీలించి భారీకేడ్లు, ప్లాట్‌ఫాంను ఇదివరకే ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం నుంచి స్వల్ప రుసుంతో బోట్‌ను నడుపుతామని, జాతర అనంతరం పరిస్థితులను బట్టి బోట్‌ను కొనసాగించాలా లేదా అన్న విషయాన్ని ప్రకటిస్తామని తెలిపారు. ఆత్మకూర్ చరిత్రలో మొదటిసారిగా చెరువులో బోట్ ఏర్పాటుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు రహ్మతుల్లా, వెంకటనర్సింహారావు, సాయిరాఘవ, మచ్చేందర్‌గౌడ్, మణివర్ధన్‌రెడ్డి, యాదగిరిశెట్టి, తెలుగు నాగేష్, దామోదర్, మహేష్, మున్సిపాలిటీ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

చెర్ల పరమేశ్వరస్వామి జాతరను పురస్కరించుకొని మార్చి 1, 2తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న జట్ల సభ్యులు పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మొదటి బహుమతి రూ.20 వేలు నగదు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాల్గో బహుమతి రూ.5 వేలు నగదుతో పాటు షీల్డులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా అందిస్తామన్నారు. వివరాలకు 97011 63250, 94940 19675, 84998 98925 సంప్రదించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



పెబ్బేరు రూరల్: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్లను గురువారం ఉదయం వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు సీజ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఇసుకను తరలించే ట్రాక్టర్లకు సరైన పత్రాలు లేదనందున వాటిని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లను ఆర్టీవో కార్యాలయానికి తరలించామన్నారు.

నీరందక ఎండుతున్న పంటలు



ఉండవెల్లి శివారులో నీరు లేక ఎండిన ఆర్డీఎస్ కెనాల్

- కంది, మొక్కజొన్న సాగు చేసిన రైతుల ఇబ్బందులు
- సాగునీటి కోసం ఎదురుచూపులు
- చేతులెత్తేసిన ఆర్డీఎస్ అధికారులు



వాడుముఖం పట్టిన మొక్కజొన్న పంట

ఉండవెల్లి: యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న, కంది పంటలకు సాగునీరు అందక ఎండుముఖం పడుతున్నాయి. ఆర్డీఎస్ కాల్వలను నమ్ముకుని పంటలు వేసిన రైతులకు ఈసారి తిప్పలు తప్పడం లేదు. భూములు కౌలుకు తీసుకున్న రైతులు ఏం చేయాల్లో పాలుపోక దిక్కుతతోచని స్థితిలో ఉన్నారు. మిరప, కంది పంటల నుంచి ఆశించిన దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరో పక్క కౌలు రైతులకు అనూకులమైన పంట మొక్కజొన్న, కంది, మినుముల నుంచైనా తేరుకోవచ్చనుకున్నా సాగునీరు చివరి పంటకు చేరకపోవడం ఒక కారణమైతే.. వారబంధి ఆదిలోనే మొదలు పెట్టడంతో కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండో పంటకు ఇబ్బందులు

ఆర్డీఎస్ నీరు అందుతుందని మొక్కజొన్నను రెండో పంటగా సాగు చేసిన రైతులకు నిరాశే మిగిలేలా ఉంది. మూడు విడతలుగా కాల్వకు నీటిని విడుదల చేశారు. కానీ చేతికొచ్చిన సమయంలో నీటి ఇబ్బందులు తలెత్తడంతో పంట ఎండుముఖం పట్టాయి. మండలంలో అధికంగా మొక్కజొన్న, కంది, మినుము పంటలను సాగు చేశారు. రెండు సార్లు నీటిని పారించినా.. మూడో తడి అందిద్దామనేలోపే సాగునీటి విడుదల నిలిపివేశారు. అధికారులకు ఫోన్ చేసి అడిగినా నీరు లేదని చెప్తున్నారని వాపోయారు.

సాగునీరు రాక..



పొలం కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశాను. పంటకు రెండు సార్లు తడులు అందించాం. కానీ మూడో తడి కోసం వేచిచూస్తూ ఆగమయ్యాం. చేతికొస్తున్న పంట కళ్ల ముందే ఎండిపోయింది. ఇప్పుడు ఎద్దుల మేతకు మాత్రమే పనికొస్తుంది. దాదాపు రూ.లక్ష పెట్టుబడి పెట్టిన. అప్పులే మిగులుతున్నాయి. ప్రభుత్వం నష్టపరిహారం కూడా అందించలేదు.

– రాముడు, రైతు, ఉండవెల్లి

ఆగమవుతున్నాం..

ఆర్డీఎస్ నీటిని నమ్ముకొని మండలంలో మొక్కజొన్న అధికంగా సాగు చేస్తారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం. సాగు నీరు లేక పంట ఎండిపోతుంటే చూస్తూ ఉండడం తప్పా ఏం చేయలేని నిస్సాహయ స్థితిలో ఉన్నాం. నేను సాగుచేసిన కంది పంట సాగు చేసి.. రెండు తడులు అందించాం. సమీప రైతుల బోర్లతో కాలం వెళ్లదీస్తున్నాం. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో బోర్లపై ఆధారపడలేం. కాల్వకు నీరు అందించి మమ్మల్ని ఆదుకోవాలి.

– శేఖర్ రెడ్డి, ఉండవెల్లి

శివపార్వతుల కల్యాణం



పర్వతాపురంలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఆత్మకూర్: మహాశివరాత్రి పురస్కరించుకొని శ్రీశైలం మల్లన్నకు ఇరుముడులు సమర్పించిన శివదీక్షాపరులు గురువారం స్థానిక బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం, చెర్లపరమేశ్వరస్వామి ఆలయం, బీసీ కాలనీలోని శివాలయంలో ప్రముఖ పూజారులు కరుణకరయ్య, కర్బసయ్య ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓం నమః శివాయ, శంభో శివశంకర, హరహర మహాదేవ అంటూ భక్తులు శివనామస్మరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 5గంటలకు స్వామివారికి జలాభిషేకం, భజన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదం అందించారు.

భక్తులకు అన్నదానం

మహాశివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులకు, 40 రోజులపాటు నియమనిష్టలతో దీక్షలు చేపట్టిన దీక్షాపరులకు గురువారం పిన్నంచర్ల గోవిందస్వామి కుమారులు బంగారుభాస్కర్ విజయలక్ష్మి, ప్రకాష్ పరిమళ, రవి లావణ్య దంపతుల ఆధ్వర్యంలో స్థానిక బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శాంతాచారి, నరేష్, బాల్‌రాజు, డీకేప్రకాష్, శివ, సతీష్, శ్రీధర్, రఘు, మురళీ, నాని, తరుణ్, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కుర్వగేరి శివాలయం, పర్వతాపురం గ్రామంలోని శివరామాలయంలో బుధవారం మధ్యరాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఖిల్లాఘనపురంలో ముందుగా శివపార్వతులను గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం గ్రామంలోని కుర్వగేరి శివాలయం దగ్గరకు చేర్చి కల్యాణ మహోత్సవం జరిపించారు. ఆయా గ్రామాల్లో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించిన ఆదిదేవుడి కల్యాణాన్ని భక్తులు చూసి తరించిపోయారు. ఈ సందర్భంగా అన్నదానం చేపట్టారు.

బుసిరెడ్డిపల్లిలో..

పాన్‌గల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని బుసిరెడ్డిపల్లి ఆదిమల్లేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం, స్వామివారి ఊరేగింపు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శివపార్వతుల కల్యాణోత్సవంలో గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి దంపతులతో పాటు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆత్మకూర్ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బుసిరెడ్డిపల్లిలో..



ఆత్మకూర్‌లో అన్నదానంలో పాల్గొన్న భక్తులు